నేటి నిజం
తెలుగు దినపత్రిక
website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com
హైదరాబాద్ ఆదివారం 13-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:253 పేజీలు:6 వెల: రూ.1/-

**నేటి కందం- నేటికి అందం**



సుందరముగ చెలువొందెడి
హిందీ పెద్దమ్మ నెప్పు డీప్సిత మొప్పన్
డెందములో నిలుపుకొనుచు
వందనమిడి నేర్వవలయు ప్రతి పౌరుండున్ !!

మాతృభాష అమ్మ,హిందీ పెద్దమ్మ అని పవన్ కల్యాణ్ అన్నారు



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

కల్తీ కల్లు దందా నేడు
కాటు వేసి చంపుతుంది
మత్తువిషం మస్తు కలిపి
మనిషినోట్లో వంపుతుంది
కళ్లముందే మృత్యుఘోష
కనబడినా చర్యలేదు
బాధ్యులపై హత్యకేసు
పెట్టేందుకు మనసురాదు



-వేల్పుల నారాయణ
9440433475

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించుకుంటేనే అభివృద్ధి - రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జులై 12: సమాఖ్య విధానంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించుకున్నప్పుడే రాష్ట్రాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ ముఖ్యమంత్రి ని జూబ్లీహిల్స్ నివాసంలో నేడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి కోసం చేపట్టిన, చేపడుతున్న వివిధ పథకాలు, ప్రాజెక్టులతో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను ముఖ్యమంత్రి ఆయనకు వివరించారు. కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం సహకరించుకున్నప్పుడే రాష్ట్రాలు అభివృద్ధి చెంది తద్వారా దేశం పురోభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

"రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతో పాటు సేవల రంగం అభివృద్ధి కోసం పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఆవలివైపున రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని చెప్పారు రేవంత్. . ఔటర్ రింగ్ రోడ్డుకు రీజినల్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేస్తూ రేడియల్ రోడ్లను ప్రతిపాదించామని మౌలిక సదుపాయాల కల్పనపై వివరాలు తెలిపారు.

తెలంగాణ అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపైన ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అధిక శాతం వడ్డీల కారణంగా తిరిగి చెల్లింపులు భారంగా మారి రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందన్నారు. వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు.. అధిక వడ్డీకి తీసుకున్న రుణాలపైన వడ్డీ తగ్గించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

# లోయలో పడిన వాహనం ఐదుగురు మృతి



శ్రీనగర్ జూలై 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జమ్ము కశ్మీర్ రాష్ట్రం రాంబన్ జిల్లాలో శనివారం ఉదయం వాహనం లోయలో పడింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో యావర్ అహ్మద్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. యుక్రల్ పోగల పరిస్తాన్ ప్రాంతంలోని సేనాబాతిలో రోడ్డుపక్కన ఉన్న 600 అడుగుల లోయలో పర్యాటకుల వాహనం పడింది.

రెస్క్యూ సిబ్బంది, అధికారులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి జీతేంద్ర సింగ్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు లక్ష రూపాయలు, గాయపడిన 25 వేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతులు తౌఖర్ అహ్మద్, షకీల్ అహ్మద్, గాయపడిన వారు మహ్మద్ రఫీక్, అబ్దుల్ లతీఫ్, అజాజ్ అహ్మద్‌గా గుర్తించారు. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ప్రాథమిక నివేదిక విడుదల

**-పక్షి ఢీ కొనలేదు.. కుట్ర కోణం లేదు.. ప్రాథమిక నివేదికలో వెల్లడి**

న్యూ డిల్లీ జూలై 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీ కొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోంది' అని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది.కాగా, జూన్ 12న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 270 మంది మరణించారు. దుర్ఘటన జరిగి శనివారానికి సరిగ్గా నెల రోజులైంది. దీంతో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిందని పేర్కొంది.

# యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం : సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ జూలై 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాష్ట్ర వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిఎం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, మూడు రంగాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలియజేశారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపైన ఆందోళన వ్యక్తం చేశారు. అధికశాతం వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఇలాంటి విధానం ద్వారానే, సమాఖ్య వ్యవస్థ బలోపేతమవుతుందని, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందని, రుణాలపైన వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి కోమటిరెడ్డి

**-బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ దే**
**-మంత్రి పొన్నం ప్రభాకర్**
**-పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

నల్గొండ, జులై 12: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం వారు నల్లగొండ జిల్లాలో తిప్పర్తి, మాడుగులపల్లి, నల్లగొండ పట్టణాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , మంత్రి కోమటిరెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వాని దేనని అన్నారు. పేద ప్రజలకు అన్ని రకాల సేవ చేసే భాగ్యం కలగడం తమ అదృష్టమని వ్యాఖ్యానించారు.

బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే.. మంత్రి పొన్నం

బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. తమ పర్యటనలో భాగంగా మంత్రులు మొదట తిప్పర్తి మండల కేంద్రంలో రూ. 20లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు హాల్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అక్కడే మొక్కలు నాటారు. మాడుగుల పల్లి మండల కేంద్రంలో రూ. 14.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మండల కార్యాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రులు ప్రారంభించారు.

అనంతరం నల్లగొండ ఆర్టీసీ డిపోలో 40 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ



కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ, నకిరేకల్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గురుకులాలకు ఆద్యులు పి.వీ.నరసింహారావు : సి.ఎస్.రామకృష్ణారావు

**-కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో పి.వి కాంస్య విగ్రహం ఆవిష్కరణ**
**-హాజరైన పలువురు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు**



శ్రీ సత్యసాయి, జులై 12: బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం గురుకులాలను ప్రవేశపెట్టి మాజీ ప్రధాని పీవీ నరసింహారావును గురుకులాలకు ఆధ్యులుగా చెప్పుకోవచ్చని, తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక సంస్కరణల వేత్త దివంగత పీవీ నరసింహారావు కాంస్య విగ్రహాన్ని శనివారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం సమీపంలోని కొడిగిన హళ్లి గురుకుల పాఠశాలలో తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థులైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సిఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలు ఏర్పాటులో ఆధ్యుడు దివంగత నేత పీవీ నరసింహారావు అన్నారు. విద్యాశాఖ మంత్రిగా గ్రామీణ ప్రాంతాలలో గురుకుల పాఠశాలల ఆవశ్యకతను గుర్తించి, రాష్ట్రంలో తొలిసారి గురుకుల పాఠశాలలను నెలకొల్పి లక్షల మంది విద్యార్థులకు భవిష్యత్తు చూపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన పట్ల ఉన్న, గౌరవం అభిమానంతో తాము చదువుకున్న పాఠశాలలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఈ సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీవీ నరసింహారావు కుమార్తె ఎమ్మెల్సీ సురభి వానిదేవి మాట్లాడుతూ.. తన తండ్రి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందకరంగా ఉందన్నారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు స్వర్గీయ పీవీ నరసింహారావు సేవలను కొనియాడారు.

కార్యక్రమంలో ముఖ్యులు రాజేంద్రనాథ్ రెడ్డి ఐపీఎస్, శ్రీనివాసరాజు ఐఏఎస్, బాలరాజు ఐపీఎస్, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఆదాయ పందుల శాఖ కమిషనర్ రఘువీర్ యాదవ్, ఆంజనేయులు ఐ ఆర్ ఏ ఎస్, డైరెక్టర్ ఆంజనేయులు, విపత్తులు అగ్నిమాపక సేవలు డైరెక్టర్ మురళీమోహన్ ఏపీ ఆర్ ఈ ఐ కార్యదర్శి మస్తానయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ మత్స్య రాజు పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధి పెరుగు సురేష్ తో పాటు గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు : మంత్రి పొన్నం ప్రభాకర్



నల్లగొండ జులై 11 : ప్రమాదాలు చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్‌లో చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అలాగే వాహనాల వెనుక వైపు రిఫ్లెక్టర్ రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా వేసుకునే విధంగా జీఓ తీసుకురానున్నట్లు, డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని దండంపల్లి వద్ద రూ. 8 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు తిప్పర్తిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మాడ్గులపల్లిలో నూతన భవనాల నిర్మాణం, నల్లగొండ బస్టాండ్‌లో ఈ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనం నడపడం, వాహనం ఫిట్‌నెస్ లేకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని తగ్గించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. మనిషికి జబ్బు చేసినప్పుడు సీటీ స్కాన్ తీసిన విధంగానే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో సాంకేతిక పరికరాల సహాయంతో సుమారు 15 అంశాల్లో వాహనం రోడ్డుపై తిరిగేందుకు పనికి వస్తుందా లేదా అన్నది నిర్ధారిస్తుందని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 17 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు

రవాణా రంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కటి 8 కోట్ల రూపాయల వ్యయంతో 17 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు రవాణా శాఖ ద్వారా స్క్రాపింగ్ పాలసీని తీసుకువచ్చామని, ఏటీసీ వల్ల ప్రతి వాహనం వాహన సారధి పరిధిలోకి వచ్చే విధంగా తెలంగాణను వాహన సారధిలో భాగస్వామ్యం చేసినట్లు చెప్పారు. భవిష్యత్‌లో డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ లను ఆటోమేటిక్‌గా నిర్వహించి ఆ టెస్ట్ లో పాస్ అయితేనే డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వల్ల 20 నెలల్లో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్లు చెప్పారు. నల్లగొండ జిల్లాకు 70 ఈ ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వగా, 10 బస్సులు నార్కెట్‌పల్లికి, మిగతావి ఇతర ప్రాంతాలకు తిప్పనున్నట్లు వెల్లడించారు. నార్కెట్‌పల్లికి 80 కొత్త బస్సులు కావాలని, అలాగే నూతన డిపో ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని రవాణా శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీవాణి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, రవాణా శాఖ కమిషనర్ చంద్రశేఖర్, విశ్రాంత ఆర్టీఓ మోహన్ రెడ్డి, ఆర్టీఓ మెంబర్లు రాజిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# కాలుబుగ్గ దేవాలయంలో చోరీ..

అమరావతి, జులై 12:: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామంలోని శ్రీ బుగ్గరామేశ్వర స్వామి ఆలయంలోకి దొంగలు చొరబడ్డారు. దొంగలు ఐదు హుండీలను పగలగొట్టి నగదును దోచుకున్నారు. శనివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో గర్భగుడి వెనుక ఉన్న గేటు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు.

గర్భగుడిలోని ఐదు హుండీల తాళాలు పగలగొట్టి లోపల ఉన్న నగదును దోచుకెళ్లిన దొంగలు.. ఆ తర్వాత హుండీలను తీసుకొని కోనేరు సమీపంలోని వాగులో విసిరేశారు. సిబ్బంది, ఆలయ పూజారులు ఉదయం స్వామివారిని పూజించడానికి రాగా.. హుండీలు లేకపోవడంతో అధికారులకు సమాచారం అందించారు. ఈ దొంగతనం సీసీటీవీ కెమెరాలో రికార్డైంది. ఐదు ఉండిలలో దాదాపుగా 40 వేలకు పైగా నగదు ఉంటుందని తెలుస్తుంది. కర్నూలు జిల్లాలోని శైవ క్షేత్రమైన బుగ్గ రామేశ్వర ఆలయంలోకి దొంగలు చొరబడ్డారని తెలుసుకున్న ప్రజలు, శివయ్యకు రక్షణ లేదా అని చర్చించుకుంటున్నారు. ఈ దొంగతనం పోలీసులకు సవాలుగా మారింది. సిసి పుట్టినరోజు ఆధారంగా పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది.

# నాఫ్స్‌కాబ్ డైరెక్టర్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 12 : ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాఫ్స్‌కాబ్ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నాఫ్స్‌కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ బీమా సుబ్రహ్మణ్యం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ డీసీసీబీలో డైరెక్టర్లతో పాటు ఉద్యోగులను సమన్వయం చేయడంతో పాటు డీసీసీబీని రూ. 3 వేల కోట్ల టర్నోవర్‌తో అభివృద్ధిపథంలో నడుతున్న నేపథ్యంలో ఆయనను డైరెక్టర్‌గా నియమించినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు !

దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు సామ్ పిట్రోడా, సుమన్ దూబే లాంటి పలువురు కాంగ్రెస్ నాయకులను కూడా వెంటాడుతున్న నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక కేసు నేడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ/చార్జిషీట్ దాఖలతో, కోర్టు కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. 2013లో బిజెపీ నాయకుడు సుబ్రహ్మణ్యన్ స్వామి దాఖల చేసిన పిటీషన్‌లో గాంధీ కుటుంబం నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికను కొనుగోలు చేయడంలో మోసం, నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలతో నేడు న్యాయస్థానంలో ఈ కేసు తార స్థాయికి చేరడం చూస్తున్నాం. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను ప్రచురణ కర్తలైన "ది అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజెఎల్)"ను కొనుగోలు చేసి, "యంగ్ ఇండియా లిమిటెడ్(వైఐఎల్)" అనే కంపెనీ ద్వారా అందులో 86 శాతం వరకు గాంధీ కుటుంబం వాటాలు పొందిన్నట్లు స్వామి ఆరోపించారు.

అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజెఎల్) అంటే?!

నాటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవహర్ లాల్ నెహ్రూ చొరవతో 1937లో కంపెనీల చట్టం కింద "అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్" లేదా "ఏజెఎల్" అనబడే పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ స్థాపన జరిగింది. "నేషనల్ హెరాల్డ్" అనే ఆంగ్ల పత్రికతో పాటు "నవజీవన్" అనే హిందీ పత్రిక, "క్వామి ఆవాజ్" అనే ఉర్దూ పత్రికల ప్రచురణ జరిగేది. నాటి స్వాతంత్ర్య సమరయోధులు 5,000 మంది వాటాదారులు కాగా ప్రధాన దాతగా నెహ్రూ నిలిచారు. నాటి స్వాతంత్ర్య పోరాటానికి ఊతం ఇచ్చే విధంగా వార్తాపత్రికలను ప్రచురించడమనే ప్రాథమిక ఉద్దేశ్యం ప్రారంభమైంది. నాడు కేంద్రంలోనూ, దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో నామమాత్రపు ధరలకు ఢిల్లీ, ముంబై, పాట్నా, పంచకుల లాంటి వందకు పైగా ప్రధాన భారత నగరాల్లో వార్తాపత్రిక పెడతామనే మిషతో వేల కోట్ల విలువైన రియల్ ఎస్టేట్ ఆస్తులను సేకరించడం జరిగింది. కాలక్రమంలో ఆర్థికంగా నష్టాలు రావడంతో ఏజెఎల్ తన వార్తాపత్రికల ప్రచురించడం నిలిపి వేసింది. దాని తర్వాత జరిగిన పరిణామాల్లో జరిగిన లావాదేవీల్లో "యంగ్ ఇండియా లిమిటెడ్ (వైఐఎల్)" సంస్థ పుట్టుకురావడం, దానికి ఆస్తులను బదిలీ చేయడంతో ఇందులో మనీలాండరింగ్ జరిగిందని కేసు నడుస్తోంది.

## యంగ్ ఇండియా లిమిటెడ్ (వైఐఎల్) అంటే?!

2010 నాటికి ఏజెఎల్‌లో 1057 మంది షేర్ హోల్డర్స్ ఉన్నారు. కాంగ్రెస్ కూటమి నేతృత్వంలో 2009లో అధికారంలోకి వచ్చిన తర్వాత నవంబర్ 2010లో కంపెనీల చట్టం ద్వారా "యువశక్తితో సామాజిక లక్ష్యాలను ప్రోత్సహించడాని"కంటూ లాభాపేక్షలేని సంస్థగా "యంగ్ ఇండియా లిమిటెడ్" లేదా "వైఐఎల్" స్వచ్ఛంద సంస్థ స్థాపించబడి ఏజెఎల్‌కు చెందిన 99 శాతం షేర్లను వైఐఎల్ కొనుగోలు చేసింది. ఈ వైఐఎల్ సంస్థలో సోనియా గాంధీకి 38 శాతం, రాహుల్ గాంధీకి 38 శాతం వాటాలు ఉండగా, ఇతర కాంగ్రెస్ నాయకులకు మిగిలిన వాటాలు కలిగి ఉన్నారు. ఈ వార్తాపత్రికలను తిరిగి ప్రారంభించాలనే ప్రతిపాదనతో కాంగ్రెస్ పార్టీ నిధుల నుంచి రూ 90 కోట్లు వడ్డీ లేని రుణాలను మంజూరు చేసింది. 2010లో కాంగ్రెస్ పార్టీ ఏజెఎల్ రుణాలను కొత్తగా స్థాపించిన గాంధీ యాజమాన్యంలోని వైఐఎల్‌కి అప్పగించింది. ఏజెఎల్ ఆస్తులపై గాంధీ కుటుంబ నియంత్రణకు వైఐఎల్‌కు అప్పగించారని ఆరోపించడం జరుగుతున్నది. కాంగ్రెస్‌కు బకాయి పడిన ఏజెఎల్‌ను కాంగ్రెస్ పార్టీ రూ 50 లక్షలు చెల్లించి 2011లో వైఐఎల్‌కు అప్పగించడం, తర్వాత నేషనల్ హెరాల్డ్ పూర్తి హక్కులను సొంతం చేసుకోవడం జరిగింది. 2010 డిసెంబర్‌లో రాహుల్ గాంధీ, 2011జనవరిలో సోనియా గాంధీలు వైఐఎల్ డైరెక్టర్లుగా బోర్డులో చేరడం జరిగింది. 2017 నాటికి వైఐఎల్‌లో సోనియాకు 38 శాతం, రాహుల్ గాంధీకి 38 శాతం, మిగిలిన 24 శాతం వాటాలను వోరా, ఫెర్నాండేజ్‌లు, ఒక్క శాతం కన్న తక్కువ వాటాలను 1,000కి పైగా వాటాదారులు కలిగి ఉన్నారు. స్వచ్ఛంద సంస్థగా ఏర్పడిన వైఐఎల్ సంస్థకు 100 శాతం పన్ను రాయితీకి కూడా అర్హత పొందింది.

## ప్రస్తుత కేసు పూర్వాపరాలు:

లాభాపేక్షలేని సంస్థ పేరుతో నేడు ప్రైవేట్ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా, మోసపూరితంగా వేల కోట్ల విలువైన ఆస్తులను వాటాదారులు స్వాధీనం చేసుకునట్లు సుబ్రహ్మణ్యన్ స్వామి కేసు వేయడంతో పాటు ఈడీ విచారణతో కూడా వాదిస్తున్నది. నకిలీ విరాళాలు, కోట్ల విలువైన అద్దె ఒప్పందాలు వంటి నకిలీ ఆదాయాలను సృష్టించి నల్లధనాన్ని తెల్ల ధనంగా మార్చారంటూ, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపణలు చేస్తున్నది. ఏజెఎల్ ఆస్తులను వైఐఎల్‌కు బదిలీ చేయడం ప్రధానంగా రియల్ ఎస్టేట్ ఆస్తులపై నియంత్రణకు మాత్రమే జరిగిందనే ఆరోపణలను ఈడీ చేస్తున్నది. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ మాత్రం ఈ కేసును రాజకీయ ప్రేరేపిత చర్యగా కొట్టిపారేస్తున్నది. నేటి బిజెపీ కేంద్ర ప్రభుత్వం తమ సంస్థలను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతన్నదని ప్రకటనలను కాంగ్రెస్ కుమ్మరిస్తున్నది.

యంగ్ ఇండియా లిమిటెడ్ అనబడే రెండవ కంపెనీ పేరుతో నేషనల్ హెరాల్డ్‌కు చెందిన వేల కోట్ల విలువైన స్థిరాస్తులను గాంధీ కుటుంబం స్వంతం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు, అలాంటిది ఏదీ లేదని కాంగ్రెస్ పార్టీ కొట్టిపారేయడం జరుగుతున్నప్పటికీ త్వరితగతిన కోర్టులో నిజానిజాలు బయట పడాలని, ప్రభుత్వాలను అడ్డం పెట్టుకొని ఎలాంటి అక్రమ సంపాదనలకు పాల్పడవద్దని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు.

–డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో భారత 44వ ప్రదేశంగా మరాఠా సైనిక స్థావరాలు

న్యూఢిల్లీ, జులై 12:యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో భారత 44వ వారసత్వ ప్రదేశంగా 'మరాఠా సైనిక స్థావరాల'కు స్థానం లభించింది. దీనికి సంబంధించి 2024–25కుగాను భారత్ అధికారిక ప్రతిపాదనను ఆమోదిస్తూ ప్రపంచ వారసత్వ కమిటీ 47వ సమావేశం ప్రశంసనీయ నిర్ణయం తీసుకుంది. ఈ అంతర్జాతీయ గుర్తింపుతో నిత్య చైతన్య భారత సాంస్కృతిక వారసత్వానికి అరుదైన గౌరవం దక్కింది. విభిన్న వాస్తుశిల్ప వైభవం, ప్రాంతీయ వైశిష్ట్యం, చారిత్రక కొనసాగింపు సంప్రదాయాలను ఇది ప్రస్ఫుటం చేస్తుంది.

భారత్‌కు ఈ చారిత్రక ఘనత దక్కడంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, మంత్రిమండలిలో తన సహచరుడైన సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెఖావత్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్‌లతో కలసి హర్షం ప్రకటిస్తూ, దేశ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు.

### భారత్‌లో మరాఠా సైనిక స్థావరాలు

మరాఠా సామ్రాజ్యం 17వ శతాబ్దం నుంచి 19వ శతాబ్దందాకా కొనసాగిన నేపథ్యంలో 12 అసాధారణ దుర్గాలతో కూడిన సైనిక స్థావరాలు నాటి పాలకుల వ్యూహాత్మక సైనిక దృక్కోణం, నిర్మాణ చతురతకు నిదర్శనాలుగా నిలిచాయి.

### సింధుదుర్గ్ కోట

కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను 2024 జనవరిలో ప్రపంచ వారసత్వ కమిటీ పరిశీలనకు పంపింది. అనంతరం సలహా సంస్థలతో పలుమార్లు సాంకేతిక సమావేశాలు సహా ప్రతిపాదిత ప్రదేశాల సమీక్షకు 'ఐసీవోఎంవోఎస్' బృందం సందర్శన, తదితర 18 నెలల నిశిత, సుదీర్ఘ ప్రక్రియ కొనసాగింది. అనంతరం ఈ రోజు సాయంత్రం పారిస్ నగరంలోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

ప్రతిపాదిత ప్రదేశాలలో మహారాష్ట్రలోని సల్హేర్, శివనేరి, లోహగడ్, ఖండేరి, రాయ్‌గఢ్, రాజ్‌గఢ్, ప్రతాప్‌గఢ్, సువర్ణదుర్గ్, పన్హాల, విజయదుర్గ్, సింధుదుర్గ్, తమిళనాడులోని జింజి కోట ఉన్నాయి.

రాయ్‌గఢ్ కోట, ప్రతాప్‌గఢ్ కోట, శివనేరి కోట, లోహగడ్, రాయ్‌గడ్, సువర్ణదుర్గ్, పన్హాల కోట, విజయదుర్గ్, సింధుదుర్గ్, జింజి కోట భారత పురావస్తు అధ్యయన విభాగం సంరక్షణలో ఉన్నాయి. అలాగే సల్హేర్ కోట, రాజ్‌గఢ్, ఖండేరి కోట, ప్రతాప్‌గఢ్ మహారాష్ట్ర ప్రభుత్వ పురావస్తు–మ్యూజియంల డైరెక్టరేట్ సంరక్షణలో ఉన్నాయి.

### సువర్ణదుర్గ్ కోట

తీరప్రాంత శిబిరాల నుంచి పర్వతాలపై బలమైన కోటల దాకా విభిన్న ప్రదేశాల్లోగల ఈ దుర్గాలు భౌగోళిక ప్రాధాన్యంతోపాటు అత్యాధునిక వ్యూహాత్మక రక్షణ ప్రణాళికపై అవగాహనను ప్రతిబింబిస్తాయి. అలాగే ఇవన్నీ భారతదేశంలో దుర్గాల సంప్రదాయాన్ని ఆవిష్కరిస్తూ, ప్రాంతీయానుసరణను విశదీకరిస్తూ సమగ్ర సైనిక స్థావర వలయాన్ని కళ్లకు కడతాయి.

సల్హేర్, శివనేరి, లోహగఢ్, రాయ్‌గఢ్, రాజ్‌గఢ్, జింజి కోటలు పర్వత ప్రాంతాల్లో నిర్మించినవి కావడంతో వీటిని పర్వత దుర్గాలుగా వ్యవహరిస్తారు. దట్టమైన అడవుల లోగల ప్రతాప్‌గఢ్‌ను పర్వత–అటవీ దుర్గంగా వర్గీకరించారు. పీఠభూమిపైగల పన్హాలాను పర్వత–పీఠభూమి కోటగా పేర్కొన్నారు. తీరప్రాంతం వెంబడిగల విజయదుర్గం ఓ కీలక తీరప్రాంత కోట కాగా– ఖండేరి, సువర్ణదుర్గ్, సముద్రం మధ్యలోగల సింధుదుర్గ్ ద్వీప దుర్గాలుగా గుర్తింపు పొందాయి.

ఈ ప్రదేశాలపై ఫ్రాన్స్‌లోని పారిస్ నగరంలో ప్రపంచ వారసత్వ కమిటీ 47వ సమావేశం తీసుకున్న ఈ ఐతిహాసిక నిర్ణయాన్ని భారత్‌లోని సుసంపన్న, విభిన్న సాంస్కృతిక వారసత్వానికి ప్రపంచవ్యాప్త గుర్తింపునివ్వడంలో కీలక ఘట్టంగా పరిగణించవచ్చు.

ఈ సమావేశం సందర్భంగా అందులో పాల్గొన్న సభ్య దేశాల్లో 18 నుంచి 20 వరకూ భారత్ ప్రతిపాదనను బలపరిచాయి. ఈ అంశంపై 59 నిమిషాలపాటు చర్చ కొనసాగగా, సభ్యదేశాల సానుకూల సిఫారసు అనంతరం ఆమోదముద్ర పడింది. దీనిపై యునెస్కో, ప్రపంచ వారసత్వ కేంద్రం, యునెస్కో సలహా సంస్థలు (ఐసీవోఎంవోఎస్, ఐయూసీఎన్) భారత ప్రతినిధి బృందానికి అభినందనలు తెలిపాయి.

నిర్దేశిత 4, 5 ప్రమాణాల కింద ప్రతిపాదించిన భారత మరాఠా సైనిక స్థావరాలు నిత్యచైతన్య సాంస్కృతిక సంప్రదాయానికి అపురూప సాక్ష్యాలు. నిర్మాణ, సాంకేతిక ప్రాధాన్యం, చారిత్రక ఉదంతాలు, సంప్రదాయాలతో ముడిపడిన లోతైన అనుబంధాలకు ప్రతిబింబాలు.

ప్రపంచంలోని 196 దేశాల్లో కనిపించే సాంస్కృతిక, సహజ, మిశ్రమ విశిష్టతను ఉమ్మడి విలక్షణ సార్వత్రిక విలువల ప్రాతిపదికన పరిరక్షిస్తూ, ప్రాచుర్యం కల్పించడమే వీటిని యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చడంలోని ఉద్దేశం. ఈ కృషిలో తన వంతుగా భారత్ 2021–25 మధ్య కాలానికిగాను ప్రపంచ వారసత్వ కమిటీలో సభ్యురాలుగా కొనసాగుతోంది.

అంతర్జాతీయ వేదికపై భారత వారసత్వాన్ని ప్రస్ఫుటం చేయడం లక్ష్యంగా నవ భారత్ చేస్తున్న అవిశ్రాంత కృషికి ఈ ప్రపంచ గుర్తింపు ఒక నిదర్శనం. అలాగే ఈ చారిత్రక సంపద పరిరక్షణలో భారత పురావస్తు విభాగం, మహారాష్ట్ర ప్రభుత్వ నిర్విరామ కృషిని కూడా ఇది చాటిచెబుతుంది.కాగా, నిరుడు న్యూఢిల్లీలో 46వ ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశం నిర్వహించిన సందర్భంగా అస్సాం లోని చరైడియోలోగల మొయిదామ్స్ కు ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం దక్కింది.

ప్రపంచ వారసత్వ జాబితాలో అత్యధిక ప్రదేశాల సంఖ్య రీత్యా భారతదేశం ప్రపంచంలో 6వ స్థానంలో, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో 2వ స్థానంలో ఉంది. కాగా, 1972నాటి ప్రపంచ వారసత్వ సదస్సు తీర్మానాన్ని 196 దేశాలు ఆమోదించాయి.

ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో భారత్‌లోని 62 ప్రదేశాలు ఉన్నాయి. భవిష్యత్తులో ఏదో ఒక ప్రదేశానికి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు లభించాలంటే తాత్కాలిక జాబితాలో చేర్చే ప్రమాణాన్ని పాటించడం తప్పనిసరి. అయితే, ప్రతి సభ్య దేశం ఏటా ఒక ప్రదేశాన్ని మాత్రమే ప్రపంచ వారసత్వ కమిటీ పరిశీలనకు ప్రతిపాదించవచ్చు.

ఈ మేరకు దేశంలోని ప్రపంచ వారసత్వ ప్రదేశాల విషయంలో భారత పురావస్తు అధ్యయన విభాగం కేంద్ర ప్రభుత్వం తరపున నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.

# తల్లాడ సర్పంచ్ బరిలో షేక్ రోబో

ఖమ్మం, జులై 12 (నేటినిజం ప్రతినిధి) :తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో తల్లాడకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు, షేక్ మెహరాజ్ (రోబో) ఉండనున్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో 41% రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తల్లాడ గ్రామపంచాయతీ సర్పంచ్ బిసి రిజర్వేషన్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీసీ మైనార్టీ వర్గానికి చెందిన రోబో సర్పంచ్ బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నాడు, ఈ మేరకు తన వర్గానికి సమాచారం అందించారు. గతంలో జనరల్, ఎస్సీ, ఎస్టీ సర్పంచులు విజయం సాధించారు. ఈసారి బిసి సామాజిక వర్గానికి చెందిన వారితో పాటు ముస్లిం నాయకులు కలిస్తే గెలుపు తనదే అవుతుందని భావించి ఎన్నికల్లో పోటీ చేస్తానని రోబో ప్రకటించారు.

# నిషిద్ధ జాబితా తయారు చేయడంలో భాగంగా... 'లూజ్ ఫాస్టాగ్' సమాచారం పంపండి: ఎన్‌హెచ్‌ఏఐ

న్యూఢిల్లీ, జులై 12:టోల్ గేట్ల వద్ద వాహనాల రాకపోకలు సజావుగా సాగిపోయేటట్లు చూడడంతో పాటు "లూజ్ ఫాస్టాగ్స్" కు సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి ఎన్‌హెచ్‌ఏఐ నడుం బిగించింది. టోల్ వసూలు చేసే ఏజెన్సీలు, అనుమతిని పొందిన వ్యాపార సంస్థల (కన్సెషనర్ల) విషయంలో అనుసరిస్తున్న విధానాన్ని మెరుగుపరిచింది. "లూజ్ ఫాస్టాగ్"లను ప్రదర్శిస్తున్న వారి వివరాలను సేకరించి వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించింది. ట్యాగులను వాహన విండ్‌షీల్డుకు అంటించకుండా, చేతుల్లో పట్టుకు చూపడాన్ని 'లూజ్ ఫాస్టాగ్స్'గా వ్యవహరిస్తున్నారు. వీటిని సాధారణంగా "ట్యాగ్–ఇన్–హ్యాండ్" అన్నా ఇదే. త్వరలో వార్షిక పాస్ సిస్టమ్‌ను, మల్టి–లేన్ ఫ్రీ ఫ్లో టోల్‌ను అమల్లోకి తీసుకు రానున్నారు. అందువల్ల ఫాస్టాగ్ ప్రామాణికతతో పాటు వ్యవస్థను మరింత విశ్వసనీయమైందిగా తీర్చిదిద్దాలంటే ముందుగా ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

వాహనాల యజమానులు కొన్ని సందర్భాల్లో కావాలనే ఫాస్టాగ్‌లను వాహనం విండ్‌స్క్రీన్‌పైన అంటించడంలేదు. దీంతో ఆయా మార్గాల్లో రద్దీ పెరగడం, తప్పుగా వసూలు చేసిన అధిక ఛార్జిని బ్యాంకుకు తిరిగి చెల్లించాల్సిరావడం, మూసివేసిన టోల్ వ్యవస్థ దుర్వినియోగంతో పాటు ఎలక్ట్రానిక్ టోల్ వసూలులో అంతరాయాలు తలెత్తుతున్నాయి. టోల్ ప్లాజాల్లో అనవసర జాప్యం చోటుచేసుకుంటున్నది. ఈ పరిస్థితి ఇతరులకు ఇబ్బందికరంగానూ మారుతోంది.

ఒక ప్రత్యేక ఇమెయిల్ ఐడీని అందుబాటులోకి తేవడం ద్వారా... లూజ్ ఫాస్టాగ్స్ సమాచారాన్ని అందించాలంటూ ఎన్‌హెచ్‌ఏఐ ఆదేశించింది. లూజ్ ఫాస్టాగ్‌ల యజమానులను బ్లాక్‌లిస్టు లేదా హాట్‌లిస్టులో ఉంచనున్నారు.

98 శాతానికి పైగా ఫాస్ట్ ట్యాగులను ఉపయోగించడం వల్ల... టోల్ వసూళ్లకు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ వ్యవస్థలో పెనువిప్లవాన్ని తీసుకువచ్చింది. అయితే లూజ్ ఫాస్టాగ్‌లు ఎలక్ట్రానిక్ విధానానికి ఇబ్బందిగా మారాయి. ఈ నేపథ్యంలో టోల్ కార్యకలాపాల్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దినట్లయితే, జాతీయ రహదారుల వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కూడా ఉండవు. ఎలాంటి జాప్యం లేకుండా ప్రయాణాలు సజావుగా సాగుతాయి.

# బీసీలకు న్యాయం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

## – కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ గౌడ్

ఖమ్మం, జూలై 12 (నేటినిజం ప్రతినిధి) :బీసీలకు న్యాయం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో, ఇప్పుడు, ఎప్పుడు కూడా బీసీలకు న్యాయం చేసే దమ్మున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా, పదవులను ఇవ్వడంలోనైనా, సంక్షేమం విషయంలోనైనా బీసీలకు న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశానికే ఆదర్శం అని కొనియాడారు. బీసీ కులాలు రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గానికి, శాసనసభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# వడ్లు మింగేసిన సౌభాగ్య లక్ష్మి -పెద్దపల్లిలో భారీ కుంభకోణం

**–మిల్లర్లకు నైవేద్యంగా సీఎంఆర్? ధాన్యం**
**–టాస్క్ ఫోర్స్ దాడులతో బహిర్గతం**
**–రెండు మిల్లులోనే 72 వేల క్వింటాళ్ల షార్టేజ్**
**–మిల్లర్లతో కుమ్మక్కు అవుతున్న అధికారులు**
**–పెద్దపల్లి జిల్లాలోనే 220 రైసు మిల్లులు**
**–దాదాపు వెయ్యి కోట్లకు పైగా నష్టం ఉంటుందని అంచనా**
**–లోతుగా విచారణ జరిపితే కళ్లు బైర్లు కమ్మడం ఖాయం**

పెద్దపల్లి, జులై 12: పెద్దపెల్లి జిల్లాలో అతిపెద్ద కుంభకోణం వెలుగు చూసింది.. సీఎంఆర్ ధాన్యం రైస్ మిల్లర్ల పాలిట వరంగా (మారింది.. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బియ్యంగా మార్చేందుకు రైస్ మిల్లర్లకు ఇస్తే.. వాటిని అప్పనంగా అమ్ముకుంటున్నారు. టాస్క్



ఫోర్సు దాడుల్లో కేవలం రెండు మిల్లుల్లో 72,000 క్వింటాళ్ల వడ్లు ఉండాల్సిన దానికంటే తక్కువగా ఉన్నాయి అంటే ఏ మేర కుంభకోణం జరిగిందో అర్థమవుతోంది. రెండు మిల్లులో 23 కోట్ల 71 లక్షల రూపాయల ధాన్యం షార్టేజ్ ఉందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ అధికారి ప్రభాకర్ రావు తెలియజేయడం కుంభకోణాన్ని బహిర్గతం చేసింది.

పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్‌లో రాష్ట్ర టాస్క్ ఫోర్స్ అధికారులు మిల్లుల నుంచి తరలిస్తున్న అయిదు లారీల ధాన్యాన్ని పట్టుకొని విచారణలో భాగంగా రెండు మిల్లులో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో విస్తుపోయే నిజాలు బహిర్గత మయ్యాయి. సాయి మహాలక్ష్మి రైస్ మిల్‌కు 2023– 24 యాసంగి సీజన్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన 80,966 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించింది. దీనికి 35వేల క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అందజేయాల్సి ఉంది. అయితే.. కేవలం 10వేల 84 క్వింటాళ్ల బియ్యం మాత్రమే అందించారు. మిల్లులో 64,922 క్వింటాళ్ల వడ్లు నిల్వ ఉండాల్సి ఉండగా అధికారుల తనిఖీల్లో కేవలం 3266 క్వింటాళ్ల వడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇంకా 61,653.57 క్వింటాళ్ల వడ్లు షార్టేజ్ రావడంతో మిల్లు యాజమాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం అమ్ముకున్నట్లు బహిర్గతమైంది.

మరో మిల్లు సౌభాగ్య లక్ష్మికి యాసంగి సీజన్‌లో 31,060 క్వింటాళ్ల వడ్లు కేటాయించగా.. ప్రభుత్వానికి 21,190 క్వింటాళ్ల బియ్యం అందించాల్సి ఉంది. కానీ, కేవలం 5,151 క్వింటాళ్ల బియ్యం మాత్రమే అందజేశారు. 23,500 క్వింటాళ్ల వడ్లు మిల్లులో ఉండాల్సి ఉండగా అధికారుల తనిఖీల్లో 10,880.14 క్వింటాళ్ల వడ్లు మాత్రమే ఉండడంతో అసలు కుంభకోణం బహిర్గతమైంది. ఈ రెండు మిల్లుల్లో 72,533.71 క్వింటాళ్ల వడ్లు కనబడకుండా పోయాయి. దీని విలువ దాదాపు 23,71,36,972 అని అధికారులు తెలియజేశారు. రెండు మిల్లుల్లోనే 23 కోట్ల వడ్ల కుంభకోణం జరిగిందంటే పెద్దపెల్లి జిల్లాలో ఉన్న 220 మిల్లుల్లో ఎన్ని కోట్ల క్వింటాళ్ల వరి ధాన్యం మిల్లర్లు అమ్ముకున్నారో పూర్తిగా తెలియాలంటే అధికారులు లోతుగా విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

దాదాపు ప్రతి రైస్ మిల్లులో ఉండాల్సిన వడ్లు లేవని విశ్వసనీయ వర్గాల సమాచారం. సీఎంఆర్ కింద కేటాయించిన వేలాది కోట్ల రూపాయల అవార్డులు మిల్లర్లు అప్పనంగా అమ్ముకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. యాసంగి, వానాకాలం సీజన్లలో కేటాయించిన అవార్డులు బియ్యంగా మార్చి ఇవ్వని రైస్ మిల్లర్లకు కూడా ఈసారి పెద్ద మొత్తంలో వడ్లు తిరిగి కేటాయించడంపై అనేక అనుమానాలున్నాయి. అధికారులు మిల్లర్లతో కొమ్ముకై చేతివాటం ప్రదర్శించి నిబంధనలను తుంగతుర్తి కోట్లాది రూపాయలతో కొనుగోలు చేసిన వడ్లను మిల్లర్లకు కట్టబెట్టారు. టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులతో ఈ వడ్ల కుంభకోణం తేటతెల్లమైందే తప్ప స్థానిక అధికారులు ఈ కుంభకోణాన్ని వెలుగు తీయ లేదంటేనే వారు చేతివాటం ప్రదర్శించారానేందుకు నిదర్శనం. పెద్దపెల్లి జిల్లాలోని సంఘం పెద్దమనిషిగా చెప్పుకునే రైసు మిల్లర్ ఒక్కరే 150 కోట్లకు పైగా వడ్లను అమ్ముకున్నట్లు సమాచారం. రాష్ట్రస్థాయి సివిల్ సప్లై అధికారులు పెద్దపల్లి జిల్లాలోని రైస్ మిల్లులపై దాడులు నిర్వహించి లోతైన విచారణ చేపడితే 1000 కోట్ల కుంభకోణం బహిర్గతమయ్యే అవకాశాలున్నాయి.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్సై కృష్ణ ప్రసాద్




ములుగు, జులై 12 : యువత చెడు వ్యసనాలకు బానిస కాకూడదని ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. ములుగు జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు అభయ మిత్ర కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం శనివారం పేరూరు గ్రామంలోని నాగులమ్మ సెంటర్ లో నిర్వహించి యువతకు తగు సూచనలు, సలహాలు అందించారు.

గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, అదేవిధంగా డ్రైవింగ్ చేసే సమయంలో హెల్మెట్ కంపల్సరిగా ధరించాలని డ్రైవింగ్ లైసెన్స్ ఆర్సి బుక్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

18 సంవత్సరాలు నిండిన వారే వాహనాలు నడపాలని, లేనిపక్షంలో బండి యజమాని నడిపే వ్యక్తిపై చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. అదేవిధంగా ఫోక్సో చట్టం గురించి తగు సూచనలు, సలహాలు అందించారు. మైనర్ బాలికలపై అత్యాచారం చేయడం చట్టరీత్యా నేరమని అలాంటి విషయాలకు దూరంగా ఉండాలని సూచించారు.

అదేవిధంగా అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, అసాంఘీక శక్తులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. యువత క్రీడలపై మక్కువ చూపించాలని, క్రీడల వలన మానసిక ఉల్లాసం వ్యాయామం కలుగుతుందని తెలిపారు. పేరూరు యువతను ప్రోత్సహిస్తూ వాలీబాల్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'రోజ్‌గార్ మేళా'.. ప్రభుత్వ విభాగాలు, సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన 51,000 కు పైగా యువతీ యువకులకు నియామక పత్రాలు

న్యూఢిల్లీ, జులై 12:ప్రభుత్వంలో వివిధ విభాగాలు, సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన 51,000 కు పైగా యువతీయువకులకు నియామక పత్రాలను ఈ నెల 12న ఉదయం 11 గంటల వేళలో వీడియో అనుసంధానం ద్వారా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

ఉపాధి కల్పనకు అమిత ప్రాధాన్యాన్ని ఇస్తామన్న ప్రధానమంత్రి వాగ్దానాన్ని నెరవేర్చే బాటలో 'రోజ్‌గార్ మేళా' ఒక ముందడుగు. యువతకు బతుకుదెరువును చూపించి వారికి సాధికారతను కల్పించడంతో పాటు, దేశ నిర్మాణంలో వారు పాలుపంచుకొనేందుకు చక్కని అవకాశాలను ఇవ్వడంలో 'రోజ్‌గార్ మేళా'ది ఒక ముఖ్య పాత్ర. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తూ వచ్చిన 'రోజ్‌గార్ మేళా'లలో 10 లక్షలకు పైగా నియామక పత్రాలను అందజేశారు.

పదహారో 'రోజ్‌గార్ మేళా'ను దేశవ్యాప్తంగా 47 చోట్ల నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వంలో వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో ఈ ఉద్యోగ భర్తీ కార్యక్రమం చోటుచేసుకొంటోంది. కొత్తగా ఉద్యోగాల్లో నియామక ప్రక్రియ పూర్తి అయిన వారు రైల్వే శాఖ, హోం శాఖ, తపాలా విభాగం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఆర్థిక సేవల విభాగం, కార్మిక, ఉపాధికల్పన శాఖలతో పాటు ఇతర మంత్రిత్వ శాఖల్లోనూ, విభాగాల్లోనూ చేరనున్నారు.

# ఇంటి గోడ కూలి ఐదేళ్ల బాలుడు మృతి..

నంద్యాల బ్యూరో, జూలై 12, నంద్యాల జిల్లా పాణ్యం మండలం తొగర్చేడు గ్రామంలో ఇంటిగోడ కూలి ఐదు సంవత్సరాల బాలుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది.

స్థానికులు తెలిపిన వివరాల మేరకు తొగర్చేడుగ్రామంలో పాత ఇంటికి మరమ్మతులు పనులు చేపట్టారు.

గోడ ప్రక్కనే ఆడుకుంటున్న ఐదేళ్ల ఆరిఫ్ అనే బాలుడిపై గోడకూలి పడింది. అదే సమయంలో అతని పక్కన ఉన్న ఆరిఫ్ తాత కరిముల్లాకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఆరిఫ్ ను మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొలుకోలేక చిన్నారి ఆరిఫ్ మృతి చెందాడు. కరిముల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పాణ్యం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# జీవితంలో ఆహారం తరువాత అసరమైనవి వస్త్రాలే - శ్రీ చౌహాన్

న్యూఢిల్లీ, జులై 12:తమిళనాడులోని కోయంబత్తూరు ఐసీఏఆర్-చెరకు బ్రీడింగ్ సంస్థ వేదికగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో పత్తి దిగుబడి పెంపు లక్ష్యంపై ఈరోజు కీలక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పత్తి చరిత్ర, ప్రస్తుత పరిస్థితి, సవాళ్లు, దేశంలో పత్తి దిగుబడిని పెంచేందుకు భవిష్యత్తు వ్యూహాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్, హర్యానా వ్యవసాయ మంత్రి శ్రీ శ్యామ్ సింగ్ రాణా, మహారాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ మాణిక్‌రావ్ కోకటే, వివిధ రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్, అధికారులు, సంబంధిత వ్యక్తులు, శాస్త్రవేత్తలు, రైతులూ పాల్గొన్నారు.

సమావేశానికి ముందు, కేంద్ర వ్యవసాయ మంత్రి పత్తి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కేంద్ర మంత్రి వారి సమస్యలు, ఆందోళనలను తెలుసుకున్నారు. శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రసంగంతో సమావేశం ప్రారంభమైంది. దేశంలోని అత్యంత పురాతన రాష్ట్రాల్లో ఒకటి, 5000ల సంవత్సరాల అపూర్వ వారసత్వం గల తమిళ భాషకు పవిత్ర భూమి అయిన తమిళనాడులో ఈ సమావేశం జరుగుతున్నదని ఆయన వ్యాఖ్యానించారు. తమిళనాడు గడ్డపైనే కొత్త వత్తి విప్లవం ఆరంభమయ్యిందన్న ఆయన.. నేటి ఈ సమావేశం కేవలం లాంఛనప్రాయం కాదనీ అంతకంటే చాలా ఎక్కువ ప్రాముఖ్యంగలదని పునరుద్ఘాటించారు.

ఆహారం తర్వాత, ఒక వ్యక్తికి అత్యంత ముఖ్యమైన అవసరం వస్త్రాలేనని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. "ఆహారం లేకుండా జీవించలేనట్లే.. వస్త్రాలు లేకుండా జీవించడమూ అంతే అసాధ్యం. వస్త్రాలు పత్తి నుంచి వస్తాయి అయితే ఈ పత్తిని పండించేది మన రైతులే. వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయితే రైతులు దానికి ఆత్మ. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో మా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఇతర దేశాలతో పోల్చితే భారత్ ఉత్పాదకత- వెనుకబడిన నేపథ్యంలో.. మన దేశంలో పత్తి ఉత్పత్తిలో గల సవాళ్లే దీనికి కారణమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు దిగుబడిని పెంచడానికి అభివృద్ధి చేసిన బీటీ పత్తి రకం ఇప్పుడు వ్యాధుల ముప్పును ఎదుర్కొంటోందనీ, ఫలితంగా ఉత్పాదకత తగ్గుతోందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి, వైరస్ నిరోధకత గల, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అభివృద్ధి చేయడం ద్వారా పత్తి ఉత్పాదకతను మెరుగుపరచడానికి ఇతర దేశాల మాదిరిగానే భారత్ సాధ్యమైన చర్యలన్నీ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మెరుగైన విత్తనాలను రైతులకు సకాలంలో అందించడమూ ముఖ్యమనీ.. దీనిని సాకారం చేయడానికి శాస్త్రవేత్తలు పూర్తి నిబద్ధతతో పనిచేయాలని కోరారు.

వివిధ రాష్ట్రాల రైతులు లేవనెత్తిన సమస్యలు, వారి డిమాండ్లకు అనుగుణంగా భవిష్యత్ వ్యూహాన్ని రూపొందిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. మంచి నాణ్యమైన వస్త్రాన్ని తయారు చేయడానికి అంతే మంచి నాణ్యత గల పత్తి చాలా అవసరమనీ, దీనిని సాధించడమే జాతీయ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత కీర్తి, శ్రేయస్సు, శక్తి నిరంతరం మెరుగవుతోందన్నారు. "వికసిత్ భారత్ సాకారమైతే మనం పత్తిని దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదు. దేశీయంగా అధిక-నాణ్యత గల పత్తిని ఉత్పత్తి చేసి దేశపు పత్తి అవసరాలను తీర్చడం మన ముందున్న సవాలు.. లక్ష్యమూ రెండూ" అని శ్రీ చౌహాన్ తెలిపారు.

చవకైన విదేశీ పత్తిని అనుమతించడానికి దిగుమతి సుంకాలను రద్దు చేయాలని వస్త్ర పరిశ్రమ తరచుగా డిమాండ్ చేస్తుండగా.. ఇది స్థానిక పత్తి ధరలకు విఘాతం కలిగిస్తుందని రైతులు వాదిస్తున్నారని శ్రీ చౌహాన్ తెలిపారు. అందువల్ల, రైతులు, పరిశ్రమలు ఇరువురి ప్రయోజనాలను ప్రభుత్వం సమతుల్యం చేస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

తన 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' గురించి శ్రీ చౌహాన్ ప్రస్తావిస్తూ.. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సోయాబీన్ పంటను గురించి గతంలో ఒక కీలక సమావేశం నిర్వహించిన సంగతిని గుర్తుచేసుకున్నారు. కోయంబత్తూరులో పత్తి పంట దిగుబడి పెంపు గురించి విస్తృతంగా చర్చించిన నేటి సమావేశవ యూ, వ్యవసాయ అభివృద్ధికి పంటల వారీ, రాష్ట్రాల వారీ వ్యూహాలపై దృష్టి సారిస్తూ సంప్రదింపుల ప్రక్రియను కొనసాగిద్దామని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

## యునెస్కో వారసత్వ జాబితాలో భారత మరాఠా సైనిక స్థావరాలకు చోటు కల్పించడంపై ప్రధానమంత్రి ప్రశంస

న్యూఢిల్లీ, జులై 12:ప్రతిష్ఠాత్మక యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో భారత 44వ వారసత్వ ప్రదేశంగా 'మరాఠా సైనిక స్థావరాల'కు స్థానం లభించడం దేశానికి గర్వకారణంగా అభివర్ణిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎనలేని సంతోషం వెలిబుచ్చారు.

ఈ వారసత్వ శాసన ప్రకటనలో 12 దుర్గాలకు గౌరవం లభించగా, వీటిలో 11 మహారాష్ట్రలోనూ, 1 తమిళనాడులోనూ ఉన్నాయి.

ఈ సందర్భంగా దేశంలో మరాఠా సామ్రాజ్య ప్రాధాన్యాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ- "ఉజ్వల మరాఠా సామ్రాజ్యం గురించి మనం మాట్లాడేటపుడు ఆనాటి సుపరిపాలన, సైనిక శక్తి, సాంస్కృతిక ప్రతిష్ఠ, సామాజిక సంక్షేమ ప్రాధాన్యాలను కూడా గుర్తు చేసుకుంటాం. ఎలాంటి అన్యాయాన్నీ సహించని ఔన్నత్యంగల పాలకులు మనకెంతో స్ఫూర్తినిస్తారు" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

మరాఠా సామ్రాజ్యం గొప్పదనం తెలుసుకోవాలంటే ఈ కోటలను తప్పక సందర్శించాలని ఆయన ప్రజలకు సూచించారు.

రాయ్‌గఢ్ కోటను 2014లో సందర్శించిన సందర్భంగా అక్కడ ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి తాను నివాళి అర్పించిన ఫొటో ప్రస్తావన సహా మరికొన్ని జ్ఞాపకాలను కూడా ఆయన ప్రజలతో పంచుకున్నారు. ఈ నేపథ్యంలో యునెస్కో గుర్తింపుపై సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వచ్చిన పోస్టుపై స్పందిస్తూ-

"ఈ గుర్తింపుపై భారతీయులందరూ ఉప్పొంగిపోతున్నారు. మహారాష్ట్రలోని 11, తమిళనాడులోని ఒక దుర్గం ఈ జాబితాలో ఉన్నాయి. ఉజ్వల మరాఠా సామ్రాజ్యం గురించి మాట్లాడేటపుడు ఆనాటి సుపరిపాలన, సైనిక శక్తి, సాంస్కృతిక ప్రతిష్ఠ, సామాజిక సంక్షేమ ప్రాధాన్యాలను కూడా మనం గుర్తు చేసుకుంటాం. ఎలాంటి అన్యాయాన్నీ సహించని ఔన్నత్యంగల పాలకులు మనకెంతో స్ఫూర్తినిస్తారు. ప్రతి ఒక్కరూ ఈ కోటలను సందర్శించి మరాఠా సామ్రాజ్యం ఘన చరిత్ర గురించి తెలుసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిస్తున్నాను.

ఈ నేపథ్యంలో నేను 2014లో రాయ్‌గఢ్ కోట సందర్శన చిత్రాలను మీతో పంచుకుంటున్నాను. అక్కడ ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు నమస్కరించే అవకాశం నాకు దక్కింది. అందువల్ల ఆ ఘట్టం సదా నా మదిలో మెదలుతూనే ఉంటుంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# రిజర్వేషన్లు మేమిస్తే .. డ్యాన్సులు చేయడం ఏమిటి .. ప్రశ్నించిన టిపిసిసి చీఫ్

హైదరాబాద్, జులై 12: తాము బీసీ రిజర్వేషన్లు తెస్తే త రంగులు పూసుకొని తీన్మార్ డ్యాన్సులు చేస్తోందని సెటైర్లు గుప్పించారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ . బీఆర్ఎస్ హయాంలో సామాజిక తెలంగాణ రాలేదన్న ఆ పార్టీకి రాజీనామా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కవిత తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రంగులు, వేషాలు మార్చినంత మాత్రాన పిల్లి , పులి కాలేదని దెప్పిపొడిచారు

గాంధీభవన్ లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, కవిత ఏ పార్టీలో ఉందో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లో దెయ్యాలు ఉన్నాయని చెప్పిన కవిత వారి పేర్లు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్లు చేసినప్పుడు కవితా లిక్కర్ స్కాంలో ఊసలు లెక్కపెడుతున్నారని ఎద్దేవా చేశారు.

తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఎవరికి కట్టబెట్టారని ప్రశ్నించారు కమలనాథులను ప్రశ్నించారు టిపిసిసి చీఫ్. రామచంద్రరావు నియామకంతోనే బీసీలపై బీజేపీ చిత్తశుద్ధి ఏంటో తేలిపోయిందని విమర్శించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే బీసీలకి రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే అని తాము పదే పదే ఏఐసీసీ హై కమాండ్ దగ్గర పట్టుబట్టడం జరిగిందని గుర్తుచేశారు. తన కోరికను, రాహుల్‌గాంధీ ఆశయాన్ని నెరవేర్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎవరూ దొంగలు.., హీరోలు.. అన్నది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు.

# ఐపీఎస్ అధికారి సిద్దార్థ్ కౌశల్ వీఆర్ఎస్ కు కేంద్రం ఆమోదం..



అమరావతి, జులై 12:ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2012 బ్యాచ్‌కు చెందిన ఈ ఐపీఎస్ అధికారి తన రాజీనామాకు వ్యక్తిగత కారణాలేనని స్పష్టం చేశారు. కౌశల్ వీఆర్ఎస్ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. దీనిపై అనేక రకాల ప్రచారాలు జరిగాయి, రాజకీయ రంగు పులుముకుంది.

రాజకీయ ఆరోపణలు, కౌశల్ స్పష్టత

చంద్రబాబు సర్కార్ ఒత్తిళ్లు, రాజకీయ వేధింపుల వల్లే ఐపీఎస్ సిద్ధార్థ్ కౌశల్ వీఆర్ఎస్ తీసుకున్నారని ప్రతిపక్ష వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అయితే, సిద్ధార్థ్ కౌశల్ ఈ ఆరోపణలను పూర్తిగా ఖండించారు. తన పదవికి రాజీనామా చేయడానికి ఎలాంటి బలవంతం కానీ, ఒత్తిళ్లు కానీ, రాజకీయ వేధింపులు కానీ లేవని స్పష్టం చేశారు. దీర్ఘకాలిక జీవిత లక్ష్యాలు, కుటుంబ సభ్యులతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.

సిద్ధార్థ్ కౌశల్ 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. కడప, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు ఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత ఏపీ డీజీపీ కార్యాలయంలో ఎస్పీ (అడ్మిన్)గా విధులు నిర్వర్తించారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా పని చేశారనే ఆరోపణలు కౌశల్ పై ఉన్న సంగతి తెలిసిందే.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్లు హర్షనీయం.. ఎమ్మెల్యే జీఎస్సార్



భూపాలపల్లి, జులై 12: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు హర్షనీయమని, కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల ను అమలు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి, టపాసులు కలిసి, మిఠాయిలు తినిపించుకుని సంబురాలు చేశారు.

ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీఎస్సార్ పాల్గొన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మీడియాతో మాట్లాడారు. సామాజిక న్యాయంతోనే అభివృద్ధి సాధ్యమని, బలహీన వర్గాల హక్కుల కోసం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. ఎన్నికల ప్రణాళికలో కామారెడ్డి డిక్లరేషన్ లో బలహీన వర్గాలకు 42శాతం రిజర్వేషన్ తెర మీదకు తీసుకువచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కులగన చేపట్టి రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పట్టణ మాజీ కౌన్సిలర్లు, బీసీ సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘ నాయకులు ఉన్నారు.

# ఏపిలోని అయిదు నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల పంట

అమరావతి, జులై 12:ఏపీలోని 5 నగరాలు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులకు ఎంపికయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ ఏడాది 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమండ్రి నగరాలు పరిశుభ్రత విషయంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. ఇందులో విశాఖ నగరానికి' స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్' అవార్డు దక్కగా . విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు 'స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్' కేటగిరీలో ఎంపికయ్యాయి. రాజమండ్రి నగరం రాష్ట్రస్థాయి మినిస్టీరియల్ అవార్డుకు ఎంపికైంది.

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించే ఈ సర్వేలో పట్టణాల్లోని పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పౌరుల సహకారం, స్థిరమైన పరిష్కారాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. విశాఖపట్నం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నగరాల పౌరులను, స్థానిక సంస్థలను అభినందించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రాష్ట్రంలో పరిశుభ్రతపై అవగాహనను మరింత పెంచేందుకు దోహదపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# తిరుమల వెళ్లే వారికి గుడ్ న్యూస్.. ఆ రైలు సేవలు పొడగింపు

తిరుపతి, జులై 12:తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులకు సౌత్ సెంట్రల్ రైల్వే శుభవార్త అందించింది. చెర్లపల్లి నుండి తిరుపతికి నడిచే ప్రత్యేక రైలు (07017/07018)ను మరో నెల రోజుల పాటు కొనసాగించాలని నిర్ణయించింది.

తొలుత ఈ రైలు సర్వీసులు జూలై చివరి వరకు మాత్రమే నడపాలని భావించిన రైల్వే అధికారులు, భక్తుల రద్దీని పరిగణలోకి తీసుకుని ఈ ప్రత్యేక రైలు సేవలను ఆగస్టు నెలాఖరు వరకు పొడిగించారు.


ఈ అవకాశాన్ని భక్తులు పూర్తిగా ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. చర్లపల్లి-తిరుపతి రైలు తెలంగాణలోని మల్కాజిగిరి, కాచిగూడ, ఉమ్దానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల్ స్టేషన్లలో ఆగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో కర్నూల్ సిటీ, డోన్, గూటీ, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లు కూడా ఈ రైలు సర్వీస్‌లో ఉండనున్నాయి. తిరుమల దర్శనం కోసం వెళ్ళే ప్రయాణికులకు ఇది ఒక అదనపు సౌకర్యం కానుంది.

## సమానత్వ సాధనే అంబేద్కర్ రచించిన రాజ్యాంగం లక్ష్యం: జస్టిస్ బీఆర్ గవాయ్

హైదరాబాద్, జులై 12: సమానత్వ సాధనే బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ లక్ష్యమని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ పాత్ర చాలా విలువైందని కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ గవాయ్ 'కానిస్ట్యూషన్ ఆఫ్ ఇండియా : ద కాంట్రిబ్యూషన్ ఆఫ్ బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కుల కోసం ఆయన ఎంతో తాపత్రయపడ్డారని చెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే నేరుగా భారత అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని రాజ్యాంగంలోని 32వ ఆర్టికల్ పేర్కొన్నారని గుర్తు చేశారు. ఇది రాజ్యాంగానికి ఆత్మ వంటిదని అభిప్రాయపడ్డారు.

ఒకే దేశం- ఒకే రాజ్యాంగం ఉండాలని ఆయన గట్టిగా నమ్మారని చెప్పారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఇన్ని ఏళ్ల కాలంలో అంతర్గతంగా.. బహిర్గతంగా ఎన్నో సమస్యలు వచ్చినా ఒకే రాజ్యాంగం కారణంగానే వాటన్నింటినీ తట్టుకొని శక్తివంతంగా నిలబడిందని పేర్కొన్నారు.




## చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి : బీఆర్ఎస్ కన్వీనర్ ఆంజనేయులు

మెదక్, జులై 12: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ చట్టబద్ధత కల్పిస్తామని నమ్మబలికి కాలయాపన చేస్తూ బీసీలను మోసం చేయడమేనన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సతమతమవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని, జాబ్ క్యాలెండర్, రాజీవ్ యువవికాసం, స్వయం ఉపాధి కల్పన, నిరుద్యోగ భృతి అని చెప్పి ఏ ఒక్కటి అమలు చేయలేదని మండిపడ్డారు.

## ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. 14 ప్రత్యేక రైళ్లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..!

హైదరాబాద్, జులై 12: చర్లపల్లి-ధర్మవరం మధ్య 14 ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రైళ్లు ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు రాకపోకలు సాగిస్తాయని పేర్కొంది. చర్లపల్లి-ధర్మవరం (07003) రైలు ప్రతి ఆదివారం నడుస్తుందని, ఆయా రోజుల్లో రాత్రి 7.55 గంటలకు బయలుదేరి మరునటి రోజు మధ్యాహ్నం 3 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని పేర్కొంది. ధర్మవరం-చర్లపల్లి (07004) రైలు సోమవారం సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి.. మరునటిరోజు సాయంత్రం 6.30 గంటలకు చర్లపల్లికి చేరుతుందని వివరించింది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె, కదిరి స్టేషన్లలో ఆగుతుందని పేర్కొంది. ఈ రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పింది.

## తప్పిదాలకు తావు లేకుండా దరఖాస్తులను పరిశీలించాలి : కలెక్టర్ హనుమంతరావు

నల్గొండ, జులై 12: భూ భారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం రామన్నపేట తాసీల్దార్ కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన పరిష్కరించుటకు తగు సూచనలు సలహాలు తెలియజేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తు భూ భారతిలో తప్పక నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. భూభారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధించిన అన్ని దరఖాస్తులను సాధ్యమనంత త్వరగా పరిష్కరించి పెండింగ్ లేకుండా డిస్పోజ్ చేయాలన్నారు.

అన్ని మాడ్యుల్స్ లో దాఖలైన భూ భారతి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను మండల తాసీల్దార్ లాగిన్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

# కట్టంగూర్‌లో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రజల ఇబ్బందులు

నల్గొండ, జులై 12: కట్టంగూర్ మండల కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కట్టంగూర్‌లో ప్రతి శనివారం జరిగే వారసంతకు సరుకుల కోసం మహిళలతో పాటు, వివిధ పనులపై వందలాది ప్రజలు, ప్రయాణికులు, కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. కాగా మండల కేంద్రంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

సరుకుల కోసం వచ్చే మహిళలతో పాటు వ్యాపారస్తులు, కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. సంతలో కొట్టుపెట్టుకునే వీధి వ్యాపారుల నుంచి తైబజారు(పన్ను) వసూలు చేస్తున్నారే తప్పా సౌకర్యాలు కల్పించడంపై అధికారులు దృష్టి పెట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

# వీధి వ్యాపారులను దెబ్బతీస్తున్న కార్పొరేట్ అంగళ్లు : పూజర్ల శంభయ్య



నల్గొండ, జులై 12:ప్రపంచీకరణ ముప్పు చిన్న పట్టణాలకూ వ్యాపించి పెద్ద పెద్ద అంగళ్లు, షాపింగ్ మాల్స్ వీధి వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నట్లు రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య తెలిపారు. చిరు వ్యాపారులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. నకిరేకల్ పట్టణంలోని రహదారి బంగ్లా వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం కామర్స్ విభాగం విద్యార్థులు వీధి వ్యాపారుల జీవనోపాధిపై చేసిన సర్వే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లాభాపేక్ష లేకుండా చిన్నమొత్తంతో రోడ్ల పక్కన సరుకులను విక్రయిస్తూ కుటుంబాల్ని పోషించుకుంటున్న చిరు వ్యాపారుల సాదక బాదకాలను సర్వేలో విద్యార్థులు సమగ్రంగా అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య మాట్లాడుతూ.. వీధి వ్యాపారుల జీవనోపాధిపై జరుగుతున్న రెండు రోజుల సర్వే విద్యార్థులు భవిష్యత్‌లో మంచి పరిశోధకులుగా మారేందుకు దోహదపడగలదన్నారు. క్షేత్రస్థాయిలో వీధి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ తెలుసుకోవడమే కాకుండా పరిష్కార మార్గాలను సూచిస్తూ విద్యార్థులు సర్వే నివేదిక రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ సీనియర్ అధ్యాపకుడు సీహెచ్ శ్రీను, అధ్యాపకులు ఉపేందర్, శివశంకర్, నర్సింహాచారి పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉన్న చెరువులకు గోదావరి జలాలు విడుదల చేయాలంటూ రైతుల ధర్నా

జనగామ రూరల్, జూలై 12 : బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరును అందించాలని మాజీ ఎంపీపీ మేకల కళింగ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జనగామ మండలంలోని షామీర్పేట గ్రామ కాళోజీ చౌరస్తాలో పలు గ్రామాల రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా కళింగ రాజు మాట్లాడుతూ.. గతంలో నిత్యం పచ్చని పంటలతో కలకలలాడిన నేల పై ఈ రోజు ఎండిపోయిన చెరువులు, కాలువలు, పంట పొలాలు దర్శనమిస్తున్నాయన్నారు. రైతులు వేసిన వరి పంట భూగర్భ జలాలు లేకపోవడంతో ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం పట్టించుకోని గ్రామాల్లో ఉన్న చెరువులకు గోదావరి జలాలు విడుదల చేయాలని రైతులందరూ రోడ్డెక్కి ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ వాళ్లు ఫోన్లో మాట్లాడి మీ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడం జరిగింది. ఒకవేళ నీటిని విడుదల చేయకపోతే భారీ మొత్తంలో ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడి చేస్తామని రైతులు, నాయకులు హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు బైరగోని యాదగిరి గౌడ్, మైపాల్, శంకర్ నాయక్, ఉప్పలయ్య, రవి, సిద్దులు, స్వామి, డానియల్, పలువురు రైతులు పాల్గొన్నారు.

